ప్రజాశక్తి
సోమవారం 24 జులై 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

చీమకుర్తిలో నారా లోకేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పనకు..

ఎఫ్‌డిఐలు తీసుకొచ్చేందుకు కృషి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

5లో

వైసిపి జిల్లా కోఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి.?

హైదరాబాద్‌లో బాలినేనితో ప్రత్యేక భేటీ

2లో

లోకేష్ వ్యాఖ్యలతో రాజకీయ వేడి

- జిల్లాలో వైసిపి ఎమ్మెల్యేలపై ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో నియోజవర్గాల్లో ఉత్కంఠ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర జిల్లాలో నిర్విరామంగా కొనసాగుతోంది. తెలుగుదేశం శ్రేణులు, అభిమానులు, ప్రజానీకం ఆయన పాదయాత్రకు ఎక్కడికక్కడే ఘనస్వాగతాలు పలుకుతున్నారు. నేతలు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. పాదయాత్ర కొండపి నియోజకవర్గం నుంచి కనిగిరి నియోజకవర్గంలోకి రాగానే వాతావరణం మారిపోయింది. మార్కాపురం నియోజకవర్గంలోనూ పూర్తయి సంతనూతలపాడు నియోజకవర్గంలోకి లోకేష్ అడుగు పెట్టారు. కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లో లోకేష్ వైసిపి ఎమ్మెల్యేలపై చేసిన ఆరోపణలు రాజకీయవేడిని పుట్టించాయి.

పొదిలి పాదయాత్రలో రైతుతో మాట్లాడుతున్న నారా లోకేష్ (ఫైల్)

పాలకపక్ష ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలపై లోకేష్ తనదైన శైలిలో ధ్వజమెత్తారు. దీంతో రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రత్యారోపణలు చేస్తున్నారు. ఎదురుదాడికి దిగుతున్నారు. లోకేష్ చేసిన ఆరోపణలు జనంలో చర్చకు తావిచ్చాయి. దీంతో వైసిపి ఎమ్మెల్యేలు వాటిని నుంచి ఏదో ఒకటి చెప్పి బయటపడేందుకు ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పుడు నియోజకవర్గాల్లో రాజకీయంగా రెండు గ్రూపుల మధ్య రాజకీయంగా ఉత్కంఠ వాతావరణం కొనసాగుతోంది. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను అవినీతి మనీసూదన్‌గా లోకేష్ అభివర్ణించారు. భూముల కబ్జాలు, ప్లాట్లు వేసిన వారి నుంచి దండుకోవడాలు, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టించడం, పేదలపై దాడులు చేయించడం వంటి అఘాయిత్యాలకు ఎమ్మెల్యే పాల్పడుతున్నారని లోకేష్ ఆరోపించారు. తెలుగుదేశం ఇన్‌ఛార్జి ఉగ్రతో పెట్టుకుంటే అంతేనన్నారు. అధికారంలోకి వచ్చాక అందరి బాకీలు 2లో

కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో మాట్లాడుతున్న ఉగ్ర నరసింహారెడ్డి

'ఉగ్ర' ఆధ్వర్యంలో లక్ష మందికి కంటి పరీక్షలు

5లో

ఒంగోలులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మణిపూర్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ డిమాండ్

2లో

వర్షం వస్తే..

పంటలు మునకే.!

- నత్తనడకన మురుగు కాలువల మరమ్మతు పనులు
- ప్రతి ఏటా పంటలు ముంపునకు గురై నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతులు పంటల సాగుకు సమాయత్తం అవ్వడానికి ముందే వేసవి కాలంలోనే మురుగు కాలువలు, వాగుల మరమ్మతు పనులు చేపట్టాలని, ప్రతి ఏటా రైతులు కోరుతున్నారు. కానీ ఏ సంవత్సరం కూడా సకాలంలో పనులు చేపట్టింది లేదు. దీంతో ఏటా భారీ వర్షాల కారణంగా సదరు నీరు దిగువకు వెళ్లే వీలు లేక పంట పొలాలు మునిగిపోతూ రైతులు పంటలను నష్టపోతున్నారు. ప్రభుత్వం సక్రమంగా తగిన రీతిలో నిధులు విడుదల చేయకపోవడంతో మురుగునీటి కాలువల మరమ్మతుల గురించి ముందస్తు చర్యలు లేకుండా పోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో చేపట్టాల్సిన మురుగుకాల్వల 2లో

పర్చూరు వాగులో చిల్లచెట్లను తొలగిస్తున్న ప్రొక్లయినర్

'నిమ్జ్' పురోగాభివృద్ధిలో అతీగతీ లేదు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-పిసిపల్లి

నిమ్జ్ పురోగాభివృద్ధిలో అతీగతీ లేదని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జివి.కొండారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నిమ్జ్ ప్రాంతంలో ఆదివారం పర్యటించి ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులు, లింగన్నపాలెం ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ 2013లో కిరణ్‌కుమార్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చొరవతో నిమ్జ్ ప్రాజెక్టును కనిగిరి నియోజకవర్గంలోని పిసిపల్లి, పామూరు మండలాలకు ఉపయోగపడే విధంగా తీసుకొచ్చారు. ఆ తరువాత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఎలాంటి పురోగతి చెందలేదు. సుమారు 50 ఎకరాలలో ఎపిఐఐసి ఆధ్వర్యంలో 355 ప్లాట్లుగా విడగొట్టి తారు రోడ్డు, సైడు కాలువలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుమించి

నిమ్జ్ భూములను పరిశీలిస్తున్న కొండారెడ్డి

ఎలాంటి అభివృద్ధి లేదు. పిసిపల్లి మండల పరిధిలోని లింగన్నపాలెం రెవిన్యూ పరిధిలో 900 ఎకరాల భూమిని పరిశ్రమల శాఖకు అప్పగించినట్లు తెలిపారు. గ్రామంలో ఉన్నత చదువులు చదివిన వారు, ఉన్నత ఉద్యోగాలు చేసేవారు పెద్దగా లేరని తెలిపారు.ప్రభుత్వం పరిశ్రమలను ఏర్పాటు చేయకుండా బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు సాగు చేసుకుంటున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి పాల్గొన్నారు. **పామూరు** : నిమ్జ్ పేరుతో పరిశ్రమల పెట్టేందుకు వ్యవసాయ భూములను తీసుకొని అభివృద్ధి చేయకపోవడం ఎంటని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జివి. కొండారెడ్డి ఆరోపించారు. నిమ్జ్ ప్రాంతంలో సిపిఎం బందం పర్యటించింది. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రైతులతో మాట్లాడుతుండగా వ్యవసాయం చేసుకుంటున్న భూములను సాగు చేయకపోవడంతో బీడుగా మారిపోయాయని బోడేవాడ రైతులు సిపిఎం బందం వద్ద వాపోయారు. ఈ సందర్భంగా జివి. కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పరిశ్రమలు పెట్టి గ్రామాల్లో ఉన్న వారికి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, కొమ్మలపాటి మాల్యాద్రి, రైతులు పాల్గొన్నారు.

లోకేష్ వ్యాఖ్యలతో రాజకీయ వేడి

(మొదటిపేజీ తరువాయి)

తీర్చుకుంటామని హెచ్చరించారు. దీంతో మరుసటి రోజున బుర్రా అక్కడకు వెళ్లి రోడ్డును కొలతలు తీసి.. జనం పెద్దగా రాలేదని, పాదయాత్రపై విమర్శలు చేశారు. ఉగ్రపైనా ఆరోపణలు చేశారు. దీనికి ప్రతిగా ఉగ్రనరసింహారెడ్డి స్పందిస్తూ తాను అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనంటూ సవాల్ విసిరారు. కనిగిరిలో రెండు గ్రూపుల మధ్య ఉత్కంఠ వాతావరణం నెలకొంది. మార్కాపురం నియోజకవర్గం పొదిలిలో జరిగిన బహిరంగసభలో లోకేష్ స్థానిక ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిని, ఆయన కుటుంబీకులను చోటా నయామ్ గ్యాంగ్‌గా అభివర్ణించారు. వ్యాపారులు ప్రభుత్వానికి జీఎస్‌టీ తోపాటు కియాటీ (కుందుర్రు, ఉడుముల ట్యాక్స్) కూడా కట్టాల్సి వస్తోందన్నారు. నియోజకవర్గంలో 378 ఎకరాల ప్రభుత్వ భూములను వారి బినామీలతో పెట్టి కాజేశారని, వాటి వివరాలను సభలోనే మీడియాకు ఇచ్చారు. ఇంకా డ్రగ్స్ కూడా అమ్ముతుంటే వాటిని పట్టుకున్నారన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ హడావుడిగా జోక్యం చేసుకుని కేసులు లేకుండా చేశారన్నారు. చెన్నకేశవస్వామి భూములను కొట్టేశారన్నారు. పొదిలిలో చర్చికి సంబంధించిన భూములను కబ్జా చేసి ఉడుముల ఆసుపత్రిని కట్టారన్నారు. గుండ్లకమ్మ, మూసీనదుల నుంచి ఇసుకను అక్రమంగా తీసుకువస్తున్నారన్నారు. రేషన్‌బియ్యాన్ని కృష్ణపట్నం పోర్టుకు తరలించి నెలకు కోటి రూపాయలు కొట్టేస్తున్నారని ఆరోపించారు. గ్రావెల్ దందాలు, లిక్కర్ మాఫియాగా ఈ గ్యాంగ్ వ్యవహరిస్తోందన్నారు. లోకేష్ చేసిన ఆరోపణలు అటు పాలకపక్షంలోనూ చర్చకు దారితీశాయి. వైసిపి అసమ్మతి నేతలు కూడా సంబరపడుతున్నారు. రెండు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి. వారిని బాగా ప్రశ్నించారనే చర్చ వైసిపి అసమ్మతి నేతల్లోనూ ఉంది. జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న ఓ పెద్దాయన ఇక్కడ గెలిచి వైసిపిలో చేరారంటూ చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంను కూడా విమర్శించారు. అయితే ఆయన లోకేష్ విమర్శలపై మౌనంగా ఉన్నారు. నియోజకవర్గాల్లో వైసిపి నేతల అక్రమాలపై లోకేష్ దృష్టి సారించి వాటిని సభల్లోనే వెల్లడించడం రాజకీయంగా దుమారం రేపుతోంది. ప్రజల్లో ఇవి ఎలాంటి ప్రభావం చూపుతాయోనన్న ఆందోళనలో పాలకపక్ష నేతలున్నారు. భూముల అక్రమాలు, ఇసుక కుంభకోణాలు, రేషన్‌బియ్యం దందాలు అన్నీ ప్రజలకు తెలిసినవే.. అందుకే ఎదురుదాడులు మొదలు పెట్టారు. ప్రత్యారోపణలు సంధిస్తున్నారు. తిరిగి తెలుగుదేశం నేతలు కూడా ఆరోపణలు చేస్తున్నారు. సమాధానాలు కూడా ఘాటుగానే చెబుతున్నారు. రెండు పార్టీల నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం ఇప్పుడే మొదలైంది. మిగతా నియోజకవర్గాల్లోనూ పాలకపక్ష నేతలపై ఎలాంటి ఆరోపణలు చేస్తారోనన్న చర్చ సాగుతోంది. తెలుగుదేశం ఇన్‌ఛార్జిలు ఇప్పటికే సమాచారం సేకరించి లోకేష్‌కు అందజేశారు. ఎక్కడ ఏ అంశాలను హైలెట్ చేయాలో చర్చించారు. ఒంగోలు, అద్దంకి నియోజకవర్గాల్లోనూ ఘాటుగా విమర్శలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక వడ్డేపాలెం ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర కౌన్సిలర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా తోట శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, శ్రీహరి, సంజీవరాణి, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ బాబు, కార్యదర్శులుగా శ్రీనివాసులు, బత్తుల రవీంద్ర, చంద్రశేఖర్ షేక్ రెహానా, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వాహీద్ ఎన్నికయ్యారు. సభ్యులుగా మధుబాబు, వెంకట రామకష్ణ, సుబ్బారావు, జిల్లా కౌన్సిలర్లుగా సుబ్బారాయుడు, సునీత దేవి, చెన్నయ్య, పుల్లయ్య, చిన్న నారాయణ, రామకష్ణ, ఇండ్ల ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, నాయకులు కమ్మనీతి వెంకటేశ్వర్లు గంజిరపల్లి వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, ఎలికా శ్రీను పాల్గొన్నారు.

వర్షం వస్తే.. పంటలు మునకే.!

(మొదటిపేజీ తరువాయి)

మరమ్మతులు వర్షాలు పడుతున్న సమయంలో చేపట్టడంతో సదరు పనులు అరకొరగా సాగుతున్నాయి. వరద ప్రవాహం వేగంగా దిగువకు వెళ్లేందుకు వీలుగా కాలువల్లో గుర్రపు డెక్కను తొలగించడం, మేట వేసి ఉన్న మట్టిని తొలగించాల్సి ఉంది. కానీ పనులు ప్రారంభించడంలో జరుగుతున్న జాప్యం వల్ల మురుగుకాలువ పక్కన ఉన్న చిల్లచెట్లను మాత్రమే తొలగించగలుగుతున్నారు. ఈ కారణంగా పంటల సాగు అనంతరం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సదరు నీరు దిగువకు వెళ్లే వీలులేక పంట పొలాలు మునిగిపోతున్న పరిస్థితులున్నాయి. ఏటా మురుగునీటి కాలువలు, వాగుల్లో విపరీతంగా గుర్రపుడెక్క, జమ్ము పెరుగుతోంది. దీంతో మురుగునీటి ప్రవాహం సాఫీగా దిగువకు వచ్చే పరిస్థితి ఉండటం లేదు. ఈ ఏడాది ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో రూ.6 కోట్ల అంచనాలతో 52 పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. రొంపేరు వాగుతో పాటు, ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ పనులు, పలు మేజర్, మీడియం డ్రైన్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. రైతులు పంటలసాగు చేపట్టడానికి ముందే అన్ని మురుగు కాలువల మరమ్మతుల పనులు పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. కానీ ఈ ఏడాది కూడా వేసవి కాలం ముగిశాక వర్షాలు ప్రారంభం అయిన తరుణం జూన్ నెలలో పనులు మొదలుపెట్టారు. వర్షాలు కురుస్తున్నందున పూర్తిస్థాయిలో మురుగు కాలువ మరమ్మతు పనులు చేయడం కుదిరే పరిస్థితి లేదు. దీంతో ఎక్కువగా చిల్లచెట్లు తొలగింపు పనులే జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతేడాది మురుగుకాలువ మరమ్మతులకు రూ.13.71 కోట్ల నిధులు కేటాయించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సకాలంలో టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉండగా విపరీత జాప్యం చోటుచేసుకుంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్ల పాటు పలు పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరగలేదు. బిల్లులు ఏవైనా వచ్చినా అవి అరకొరగానే వచ్చాయి. ఇలాంటి నేపథ్యంలో గత సంవత్సరం మురుగు కాలువల మరమ్మతులకు అధికారులు టెండర్లు పిలుస్తూ షరతులు పెట్టారు. గతంలో చేసిన పనులకే బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు అప్పట్లో ఆసక్తి చూపలేదు. బిల్లులు మంజూరు కావన్న సందేహంతో కాంట్రాక్టర్లు టెండర్లు వేసేందుకు చాలాకాలం ముందుకు రాలేదు. రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించాక వీలున్న చోట మురుగుకాలువల మరమ్మతులు అరకొరగా జరిగాయి. ఈ కారణంగా గత వ్యవసాయ సీజన్‌లో పలు దఫాలుగా కురిసిన వర్షాలకు మురుగునీరు దిగువకు వెళ్లే వీలులేక రైతులు నష్టపోయారు. ఈ ఏడాది అయినా సకాలంలో పనులు చేస్తారని అనుకుంటే అదే పునరావృతమయింది. బాపట్ల నియోజకవర్గ పరిధిలో రూ.కోటి 31 లక్షలతో 14 పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో 5 పనులకు టెండర్లు పిలిచి మరో 5 పనులు నామినేషన్‌పై ఇచ్చారు. చీరాల నియోజకవర్గ పరిధిలో 5 పనులకు టెండర్లు పిలవగా రూ.17 లక్షల విలువైన ఒక పని కోసం ఎవరూ టెండర్ వేయలేదు. నామినేషన్‌పై ఒక పని ఇచ్చారు. కుందేరులో గుర్రపుడెక్క తొలగింపు పని కూడా ఇందులో ఉంది. అయితే టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు బిల్లులు సక్రమంగా వస్తాయో, రావో అన్న సందేహంతో పనులు ప్రారంభించడం జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. వర్షాలు కూడా పడుతున్న నేపథ్యంలో పనులు సక్రమంగా జరగడం లేదు. కాల్వ గట్లపై ఉన్న చిల్లచెట్లను మాత్రం తొలగించగలుగుతున్నారు. పూడికలు తీయడం సాధ్యపడేలా లేదు. ఈ కారణంగా ఈ సీజన్‌లో కూడా రైతులకు ఇక్కట్లు తప్పవా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బాపట్ల నుంచి చినగంజాం వరకు మాగాణి సాగు చేపట్టే సమయం ఇంకా ఉన్నందున వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే మురుగు కాలువల మరమ్మతులు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నేడు గుర్రం జాషువా వర్ధంతి

బాపట్ల : గుర్రం జాషువా. తెలుగు సాహిత్య వనంలో అద్భుతమైన ప్రజాకవిగా వాసికెక్కారు. బాపట్లతో జాషువాకు ఉన్న అనుబంధం నేపథ్యంలో నేడు జాషువా వర్ధంతిని పలు సంఘాలు నిర్వహించనున్నాయి. అద్భుతమైన ఖండ కావ్యాల ద్వారా తెలుగునాట ప్రజాకవిగా జాషువా చెరగని ముద్ర వేసుకున్నారు స్త్రీల పట్ల అభిమానం, అనురాగం గల జాషువా ముంతాజ్ మహల్, వంచిత కావ్యాలలో వారిపట్ల ఔన్నత్యాన్ని ఎంతో ఉన్నతంగా ప్రదర్శించారు. ఫిరదౌసి, గబ్బిలం వంటి ఖండ కావ్యాలకు రచనలు చేసి వడగాల్పు నా జీవితమైతే వెన్నెల తన కవిత్వం అని చాటుకున్నారు.

NAME CHANGE

I VENKATA RAMA RAO. M S/O Subbarao (Army No: 14412037X R/O Ravinuthala Village, Korisapadu Mandal, Bapatla (Previously PRAKASAM) District, have changed My Wife's Name from **VAJJA SREE-LAKSHMI** to **SRILAKSHMI VAJJA** and DATE of birth is 06-06-1981. Due to variation of army and civil records

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి. నెం: 59/2020 ఓ.ఎస్. నెం: 68/2016

బత్తుల పెద్ద గురవయ్య ...పిటీషనర్/డిహెచ్ఆర్

వర్సెస్

1.నల్లబోతుల శ్రీను వగైరా ..రెస్పాండెంట్స్/ జెడిఆర్స్

1వ రెస్పాండెంట్/జెడిఆర్‌కి నోటీసు

ఆర్డర్ 21 రూల్ 52 సి.పి.సి

నల్లబోతుల శ్రీను, తండ్రి: రామలక్ష్మయ్య

నివాసం: కె.నాగులవరం గ్రామం

పెద్దారవీడు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.లో పిటీషనర్/డిహెచ్ఆర్ ఆర్డర్ 21 రూల్ 52 సిపిసి పిటీషన్‌లో నీ హాజరు నిమిత్తం కోర్టువారు తేదీ: 24-07-2023కి వాయిదా వేసియున్నారు. కాబట్టి నీవు ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు పిటీషన్‌ను విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా: 24-07-2023 **తోడేటి వెలుగొండయ్య,**

మార్కాపురం **పిటీషనర్ తరపు అడ్వకేట్**

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఐ.ఎ. 1277/2021 ఇన్ ఓ.ఎస్. 81/2020

మారంరెడ్డి కోటిరెడ్డి ...పిటీషనరు/వాది

వర్సెస్

నార వెంగయ్య అలియాస్ వెంకటయ్య (Died) his LRs నార వెంకటసుబ్బమ్మ వగైరాలు

...Respondents / Proposed defendants

టు,

రెస్పాండెంట్ నెం: 3

నార సత్యనారాయణరెడ్డి, తండ్రి: లేట్ వెంగయ్య అలియాస్ వెంకటయ్య, వయసు: 41 సం॥, హిందూ, వ్యవసాయం, బి.చెర్లోపల్లి గ్రామం, తోకపల్లి పోస్టు, పెద్ద ఆరవీడు మండలం,ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని ప్రతివాది నార వెంగయ్య అలియాస్ వెంకటయ్య చనిపోయినందున ఆయన వారసులుగా దావాలో నిన్ను 4వ ప్రతివాదిగా చేర్చమని వాది/పిటీషనరు ఎల్ఆర్ఎస్ పిటీషన్‌ను దాఖలు చేసినందున నీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపగా నీకు ముట్టని కారణం చేత ఇందు మూలముగా నీకు తెలియజేయునది ఏమనగా 31/07/2023వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై ఇందు విషయమై నీ ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలసినది. లేనియెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా: 31/07/2023 వి. శ్రీనివాసరావు

మార్కాపురం వై.కోటేశ్వరరావు

అడ్వకేట్స్, మార్కాపురం

ది సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : మార్కాపురం

ఐ.పి. నెం: 14/2021

తాళ్లపల్లి ప్రసాద్ ... పిటీషనర్

వర్సెస్

మంచికంటి వెంకటరంగ సుబ్బరాయుడు మరియు మరో ఎనిమిది మంది ఇతరులు ...రెస్పాండెంట్స్

టు,

మంచికంటి వెంకట రంగసుబ్బరాయుడు

తండ్రి: శ్రీనివాసులు, వయసు: 45 సం॥, హిందూ, వ్యాపారం, డోర్ నెం: 6-41, నక్కావారి వీధి, బేస్తవారిపేట గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు పిటీషన్ ఒకటవ రెస్పాండెంట్ (ఆర్1) నుండి బాకీ వసూలు నిమిత్తం క్రెడిటర్ ఐ.పి. దాఖలు చేసి మీకు పిటీషన్ సమన్లు అనేక పర్యాయములు పంపగా మీకు ముట్టనందున పేపర్ ప్రకటన ద్వారా సమన్లు జారీ అగుటకు కోర్టు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. మీ సమన్లు నిమిత్తం వాయిదా 10/08/2023వ తేదీన పై కోర్టు నందు ఉండి ఉన్నది. సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు కానీ, మీ తరపు వకీలు గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

స్థలం: మార్కాపురం **ఇట్లు**

తొమ్మండ్రు హరికృష్ణ

పిటీషనర్ తరపు అడ్వకేట్

మార్కాపురం.

ప్రజాశక్తి
సోమవారం 24 జులై 2023

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

- 17 వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-సింగరాయకొండ

దేవరపల్లి నాగమురళి అనే వ్యక్తి 17 మోటార్ సైకిళ్లు దొంగలించాడని ఆదివారం నాడు ఒంగోలు డిఎస్పీ వి నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో సింగరాయకొండ సిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. దేవరపల్లి నాగమురళి జాతీయ రహదారి మీద ఉన్న గ్రామాలను టార్గెట్ చేసి రాత్రి వేళలో హ్యాండిల్ లాక్ వేయని మోటారు బైక్‌లను గుర్తించి ఆ మోటార్ బైకును మరో ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ తాళాలు తీయించుకొని వాటిని స్నేహితుల ద్వారా తాకట్టు పెట్టిస్తూ ఉంటాడని, అతని వద్ద సింగరాయకొండలో రెండు, ఒంగోలు తాలూకా పరిధిలో ఒకటి, ఒంగోలు 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలో ఒకటి, తెలంగాణ రాష్ట్రంలో 9 దొంగతనాలు చేసి ఎటువంటి క్లూ దొరక్కుండా జాగ్రత్తపడుతూ ముందుకు పోయేవాడని అన్నారు. ఆరు బుల్లెట్లు, ఆరు పల్సర్ బైకులు, రెండు యూనికాన్లు, ఒకటి డీలక్స్ బండి, రెండు షైన్ బండ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.22 లక్షల రూపాయల వరకు ఉంటుందని డిఎస్పీ వివరించారు. ఎక్కువ సంఖ్యలో మోటార్ బైకులు పోతున్నాయని జిల్లా ఎస్పీ మల్లికాగర్గ్ వివరించడంతో తమ పర్యవేక్షణలో సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి శ్రీరామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయి దేవరపల్లి నాగమురళిని జాతీయ రహదారి దగ్గరలో ఉన్న శానంపూడి రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు డిఎస్పీ వివరించారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనపరిచిన సీఐ రంగనాథ్‌ను, ఎస్ఐ టి శ్రీరామ్, ఏఎస్ఐ సిహెచ్ శేషారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జి రమేష్‌బాబు,

వివరాలు తెలుపుతున్న డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి

కానిస్టేబుల్ సుమన్, శ్రీను, మహేష్‌లను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేసినట్లు తెలిపారు.

బంగారం చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ నెల 18వ తేదీన లిటిల్ ఏంజెల్స్ స్కూల్ వద్ద ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో బంగారపు తాళిబొట్టు చైను లాక్కుని వెళ్లిన ముద్దాయి కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దర్శనాల ఏడుకొండలును కూడా అరెస్టు చేసినట్లు డిఎస్పీ వి నారాయణస్వామిరెడ్డి తెలిపారు. అతడిని సింగరాయకొండ, టంగుటూరు మధ్యలో అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద ఐదు సవర్ల బంగారంతో పాటు మోటారు బైకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.2,35,000 ఉంటుందని డిఎస్పీ నారాయణ స్వామిరెడ్డి వివరించారు. ఈ కేసులో మంచి ప్రతిభ కనబరిచిన టంగుటూరి ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషాను అభినందించినట్లు చెప్పారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

టంగుటూరు మండలం కందులూరు గ్రామంలో ఈ నెల 23వ తేదీ జరిగిన హత్య కేసులో ముద్దాయిని అరెస్టు చేసినట్లు డిఎస్పీ వి నారాయణస్వామిరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన గొల్లపూడి లాజర్ చెల్లెలు అఖిల భర్త పసుమర్తి ఆశీర్వాదాన్ని రూ.30 వేల డబ్బులు కోసం తగాదపడి బావ ఆశీర్వాదాన్ని హత్య చేసినట్లు తెలిపారు. బేల్దారి పనుల కోసం అడ్వాన్స్ ఇప్పించి మరోచోట పనిచేస్తున్నారని, బావాబామర్దుల మధ్య గొడవ జరిగింది. ఈ నెల 19వ తేదీన ఇద్దరి మధ్య గొడవ జరుగుతున్న సమయంలో గొల్లపూడి లాజర్ పసుమర్తి ఆశీర్వాదాన్ని కత్తితో పొడవడంతో బాగా రక్తం కారి చనిపోయినట్లు తెలిపారు. ముద్దాయి లాజర్‌ను తూర్పు నాయుడుపాలేనికి వెళ్లే దారిలో అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన సిఐ రంగనాథ్‌ను, టంగుటూరు ఎస్ఐ ఎస్‌కె ఖాదర్ బాషాలను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో ఈ మూడు కేసులకు సంబంధించిన వివరాలను ఒంగోలు డిఎస్‌పి వి నారాయణస్వామిరెడ్డి వెల్లడించారు. తక్కువ ధరలకు బైకులు వస్తున్నాయని ఎవరూ కొనవద్దని వివరించారు. లక్షల రూపాయలు చేసే బుల్లెట్ బైక్‌లు రూ.20 వేలకు, రూ.30 వేలకు అమ్ముతుంటే జనం కొని జైలు పాలు కావద్దని అన్నారు. అదేవిధంగా చిన్నచిన్న గొడవలకు చంపుకునే విధంగా ఉండవద్దని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న మోటారు బైకులను, రికవరీ చేసిన బంగారాన్ని డిఎస్పీ పరిశీలించారు. ఈ సమావేశంలో సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, సింగరాయకొండ ఎస్ఐ టి శ్రీరామ్, టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా తదితరులు ఉన్నారు.

గంజాయి కేసులో నిందితులు అరెస్ట్

మరో 22 కిలోల గంజాయి, టివిఎస్ స్కూటర్ స్వాధీనం ● వేటపాలెం ఎస్ఐ సురేష్

ప్రజాశక్తి-వేటపాలెం

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు అయిన కేసులో ప్రధాన నిందితులను అరెస్ట్ చేసినట్లు వేటపాలెం ఎస్ఐ జి సురేష్ ఆదివారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ప్రెస్‌నోట్ వివరాల ప్రకారం.. అల్లూరు సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అన్నవరం గ్రామంలో నివాసం ఉండే ఏ1 నిందితుడు బల్జి గోవిందు చాలాకాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఒరిస్సా రాష్ట్రంలోని రైతాంగం వద్ద అధిక మొత్తంలో కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. బల్జి గోవిందు వద్ద అనకాపల్లి జిల్లా పాపంపేటకు చెందిన రాజనా దుర్గా హరిప్రసాద్ అనే ఏ2 నిందితుడు, ఏ3 నిందితుడు స్వామి, జి మాడుగుల మండలం సరియ గ్రామానికి చెందిన ఏ4 లవ్వాబు సింహాచలంలు గ్రూపుగా కొనుగోలు చేసి ఇతరులకు

పోలీసులు స్వాధీనం చేసుకున్న టివిఎస్ స్కూటర్

అమ్ముతుంటారు. ఈ నెల 15వ తేదీన చీరాల రూరల్ సిఐ ఏ మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో వేటపాలెం ఎస్ఐ సురేష్, సిబ్బంది కలిసి గంజాయి ముఠాగా ఉన్న 33 మందిలో 28 మందిని అరెస్ట్ చేశారు. ముద్దాయిల వద్ద నుంచి 50 కేజీల గంజాయి, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకొని జైలుకు పంపారు. శనివారం ప్రధాన ముద్దాయిలు అరెస్ట్ కాకుండా బెయిల్ తీసుకొనేందుకు ఒంగోలులో లాయర్ల కోసం తిరుగుతూ మార్టూరులో సరుకు కొన్న బిళ్ల ప్రకాష్ ఇంటికి డబ్బు వసూల్ చేసుకోవడాని వెళ్లిన క్రమంలో 22 కిలోల గంజాయి, అక్రమ రవాణాకు ఉపయోగించిన స్కూటర్‌ను స్వాధీనం చేసుకొని ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు ముద్దాయిలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ఏ3, ఏ17, ఏ18లను కూడా వీలైనంత త్వరగా అరెస్ట్ చేస్తామని వేటపాలెం ఎస్ఐ జి సురేష్ తెలిపారు.

శ్రీరంగ క్షేత్రం వద్ద భద్రతా చర్యలు చేపట్టాలి

కారు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన మహిళకు పోస్టుమార్టం ● మృతదేహం బంధువులకు అప్పగింత

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన శ్రీరాం రాధాకుమారి మృతదేహానికి ఆదివారం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు పోస్ట్‌మార్టం నిర్వహించారు. శనివారం రాత్రి అద్దంకి పట్టణానికి చెందిన రాధాకుమారి తన కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరులోని సమీప బంధువు అనారోగ్యానికి గురవ్వడంతో పలకరించి తిరిగి అద్దంకి వెళుతూ మార్టూరు సమీపంలోని ఇసుకదర్శి శ్రీరంగ క్షేత్రం ఆలయం వద్ద టిఫిన్ చేసి రోడ్డు దాటుతుండగా ఒంగోలు వైపు వెళుతున్న కారు అతివేగంగా వెళ్తూ రాధాకుమారిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లింది. ప్రమాద తీవ్రతకు గాల్లోకి ఎగిరి డివైడర్‌పై పడి రాధాకుమారి అక్కడికక్కడే మృతిచెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ప్రమాద తీవ్రతకు మృతురాలి చేయి, కాలు తెగిపోయి సమీపంలోని టీ స్టేప్ సెంటర్‌లో ఎగిరి పడటంతో అక్కడ ఉన్న స్థానికులు

మృతి చెందిన రాధాకుమారి

భయభ్రాంతులకు గురయ్యారు. రాధాకుమారితో పాటు రోడ్డు దాటుతున్న కుమారుడు, మనుమడు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన కారు కోసం మార్టూరు ఎస్ఐ కోడూరి కమలాకర్ గాలింపు చర్యలు చేపట్టారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆ ప్రాంతం ప్రమాదాలకు నిలయం

మార్టూరుకు అత్యంత సమీపంలోని ఇసుక దర్శి వద్ద ఏర్పాటు చేసిన శ్రీరంగ క్షేత్రం ఆలయాన్ని దర్శించుకోవడానికి వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది భక్తులు నిత్యం వస్తుంటారు. గతంలో జాతీయ రహదారికి దూరంగా ఉన్న ఆలయం ఎన్‌హెచ్ 16 విస్తరణ పనుల్లో భాగంగా జాతీయ రహదారికి ఆనుకొని ఉండటంతో ఆ ప్రాంతంలో రోడ్డు దాటే భక్తులు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. రాత్రి వేళల్లో అయితే ఇక చెప్పే పనిలేదు. శ్రీరంగ క్షేత్రం గుడి మీదుగా అత్యంత వేగంగా వాహనాలు దూసుకెళతాయి. బంధువును పరామర్శించిన రాధాకుమారి ఆలయం సందర్శన కోసం వెళ్లి అక్కడే అల్పాహారం తిని రోడ్డుదాటే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకోవడంతో ఆమె కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. నిత్యం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ఇసుకదర్శి శ్రీరంగక్షేత్రం ఆలయం వద్ద పోలీసులు భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అపార్టుమెంటు నుంచి

కింద పడిన యువకుడు

విరిగిన కాళ్లు.. పరిస్థితి విషమం

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని బ్రహ్మానంద కాలనీ సమీపంలోని శాంతి రెసిడెన్సీలో ఆదివారం ప్రమాదవశాత్తు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న పరమేశ్వరరెడ్డి 4వ అంతస్తులు నుంచి కింద పడడంతో తలకు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు 108కు సమాచారం ఇవ్వడంతో ముందుగా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బంధువులు ఒంగోలు కిమ్స్‌లో చేర్పించి వైద్యం అంది స్తున్నారు. యువకుడు మండలంలోని శంఖవరప్పాడు గ్రామానికి చెందినవాడు. ఈ ప్రమాదంలో యువకునికి రెండు కాళ్లు విరిగిపోయాయి. తలకు తీవ్ర గాయాల య్యాయి. యువకుని పరిస్థితి కొంతమేర విషమంగా ఉందని సమాచారం.

సముద్రతీరంలో వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-చీరాల

చీరాల మండలం వాడరేవు సముద్ర తీరంలో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరాల జక్కా వారి వీధికి చెందిన జి శివ నాగేశ్వరరావు కోటేశ్వరమ్మ దంపతులకు కుమారుడు కుమార్తె సంతానం. ఇద్దరికీ వివాహం అవ్వగా కుమార్తె విజయవాడలో, కుమారుడు హైదరాబాదులో ఉంటున్నారు. గతంలో చీరల వ్యాపారం చేయగా ప్రస్తుతం ఖాళీగానే ఇంటి వద్ద భార్యతో కలిసి ఉంటున్నాడు. రోజు ఉదయం లాగే వాకింగ్‌కి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరాడు. తిరిగి ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారుపడ్డారు. అనంతరం కొద్దిసేపటికి కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. వాడరేవులోని దత్తాత్రేయ హెచ్చి సమీపంలో శివ నాగేశ్వరరావు(66) మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. మృతదేహాన్ని చీరాల ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులు అప్పగించారు. ఈ మేరకు ఈపురుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబంలో గొడవలా లేక ఇంకేమైనా జరిగిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తిరునాళ్లలో విద్యుత్ ప్రమాదం

తండ్రి మృతి, కొడుకుకు గాయాలు

ప్రజాశక్తి-చీరాల

గ్రామ ప్రజలు సంతోషంగా పండుగ చేసుకుంటున్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల ఊరేగింపులో అపశతి చోటుచేసుకుంది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మండలంలోని గవినివారిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గవినివారిపాలెంలో పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి గ్రామస్తులు ట్రాక్టర్‌పై డీజే సౌండ్ సిస్టంతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఊరేగింపు ఓ వీధికి వచ్చేసరికి సమీపాన ఉన్న ఒరిగిన విద్యుత్తు స్తంభానికి చెందిన ప్రధాన వైర్లు డీజే బాక్సులకు తగిలాయి. దీనిని చూసుకోకుండా ట్రాక్టర్ ముందుకు వెలటంతో స్తంభం ఒరిగి విదుత్తు ప్రధాన వైర్లు జారి సమీపాన ఉన్న ఎం చిన్న అంకన్న(40), ఇతని కుమారుడు గోపిచంద్‌పై పడ్డాయి. దీంతో చిన్న అంకన్న అక్కడికక్కడే మృతిచెందగా, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడికి చికిత్స నిమిత్తం గ్రామస్తులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఇతను చికిత్స పొందుతున్నాడు. చినఅంకన్న మృతదేహానికి శవపరీక్ష చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వ్యవసాయ పనులు చేసుకునే ఇతనికి భార్య కోటేశ్వరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈపూరుపాలెం పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

మృతి చెందిన చిన్న అంకయ్య

మంచి చేతిరాత.. మార్చును నీ తలరాత

గంగవరంలో ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువు కన్నా చేతి రాతపై దృష్టి సారిస్తున్నారు. కొందరు డబ్బులు ఇచ్చి చేతి రాత నేర్చుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించి వారి తలరాతను మార్చుకుంటున్నారు. నిరుపేద కుటుంబాల్లోని, ప్రభుత్వ పాఠశాలల్లోని చదువుకునే విద్యార్థులు చేతి రాతపై దృష్టి సారించలేక పోతున్నారు. కష్టపడి చదివినా తుది పరీక్షల్లో చేతి రాత బాగాలేక, అను కున్న మార్కులు సాధించలేక నిరుత్సాహపడి పోతున్నారు. వీరి పరిస్థితిని అర్థం చేసుకున్న ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలోని గంగవరం బాలల విద్య, వైజ్ఞానిక వేదిక ఆధ్వర్యంలో ఉచితంగా రెండు ఆదివారాలు మంచి రాతపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ కళ్యాణ మండపం వేదిక అయింది. ఈ నెల 9వ

మంచి చేతి రాతలో శిక్షణ ఇస్తున్న రాజా రమేష్

తేదీ మరియు 23వ తేదీ ఆదివారాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒంగోలుకు చెందిన గుడ్ హ్యాండ్ రైటింగ్ ఇనిస్టిట్యూట్ శిక్షకులు గంగవరం వచ్చి 90 మంది విద్యార్థులకు మంచి చేతిరాతపై శిక్షణ ఇచ్చారు. ఇంకొల్లు, గంగవరం, పావులూరు, చందలూరు గ్రామాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. మంచి చేతిరాతతో పాటు ప్రజానాట్య మండలి ఒంగోలు ప్రతినిధి కావూరి గిరిబాబు విద్యార్థులకు అభ్యుదయ గీతాలను నేర్పించారు. ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా కార్యదర్శి ఆర్య విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు విద్యార్థులకు కావాల్సిన భోజనంతో పాటు వేదికను అందించి ఆర్థికంగా తోడ్పడిన కరి మార్కండేయులు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల, శ్రీ కోదండరామస్వామి దేవాలయం ట్రస్టు బోర్డు వారికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. గంగవరం బాలల విద్య, వైజ్ఞానిక వేదిక కన్వీనర్ ఏవి సుబ్బారావు, సిఐటియు రాష్ట్ర నాయకులు వై సిద్దయ్య, దాతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

90 మందికి శిక్షణ ఇచ్చాము: కావూరి గిరిబాబు, శిక్షకుడు, ఒంగోలు

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఇంగ్లీషులో మంచి చేతి రాత కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. 4 గ్రామాల నుంచి 90 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిర్వాహకులు భోజన ఏర్పాట్లతో పాటు విద్యార్థులకు మంచి వేదిక అందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల తలరాత మారుస్తుంది.

చేతి రాత శిక్షణ బాగుంది: కె వెంకటేష్, 9వ తరగతి విద్యార్థి, కట్టావారిపాలెం

చేతి రాత శిక్షణ బాగుంది. డబ్బులు ఇచ్చి నేర్చుకునే కంటే గంగవరం విద్య వైజ్ఞానిక వేదిక వారి సహకారంతో ఉచితంగా నేర్చుకున్నాను. భోజనం పెట్టి మా తల రాతను మార్చుకోమని చెప్పటం బాగుంది.

ఇలాంటి కార్యక్రమాలు అవసరం: షేక్ కౌసర్, దగ్గుబాడు

భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు పెట్టటం వల్ల కొత్త విషయాలు తెలుసుకుంటాము. మంచి చేతిరాతతో పాటు అభ్యుదయ గీతాలు కూడా నేర్పించారు. శిక్షణ కార్యక్రమం బాగుంది. ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆంగ్లేయుల గుండెల్లో సింహస్వప్నం ఆజాద్

ప్రజాశక్తి-బాపట్ల: ఆంగ్లేయుల గుండెల్లో రైళ్ల పరిగెత్తించి వారికి సింహ స్వప్నంగా నిలిచిన చంద్రశేఖర్ ఆజాద్ ధైర్య సాహసాలు నేటి తరం అలవర్చుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి మదన్మోహన్ చెట్టి అన్నారు. ఆదివారం ఆజాద్ 117వ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల కార్యాలయం వద్ద ఆజాద్ విగ్రహానికి చెట్టి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమంలో లాలా లజపతిరాయ్ మరణానికి కారకులైన ఆంగ్లేయ అధికారులను హతమార్చి ఆజాద్ భారతీయుల సత్తా చాటారు. సాయుధ పోరాట బాట పట్టిన తొలి విప్లవకారుడు అజాద్ అన్నారు. భగత్‌సింగ్ వంటి త్యాగధనులకు ఆజాద్ మార్గదర్శకత్వం వహించారన్నారు. ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు, న్యాయవాదులు జడ్ బాషా, భాస్కరగౌడ్ పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

జాబితా సవరణలో పాల్గొనండి: ఏలూరి

ప్రజాశక్తి-యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామంలో స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదివారం పర్యటించారు. పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు సవరణ జాబితాలో పాల్గొనాలని చెప్పారు. ఎంఎల్ఎతో పాటు నాయకులు రావిపాటి సీతయ్య, కె నాగేశ్వరరావు, వెంకటస్వామి, వజ్జ సుబ్బ రామయ్య, వి వీరయ్య, పి సాంబశివరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్ల రామనాథం కన్నుమూత

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడుకు చెందిన ప్రముఖ సంఘసేవకులు, దాత గోరంట్ల రామనాథం(89) కారంచేడులోని తన స్వగృహంలో శనివారం నాడు కన్ను మూశారు. వృద్ధాప్యం కారణంగా అనారోగ్యం పాలై ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1934లో జన్మించిన రామనాథం అప్పటిలోనే ఎల్ఎల్బి పూర్తి చేసి బాపట్ల, చీరాల కోర్టుల్లో కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. చాలా కేసులు పేదల కోసం ఉచితంగానే వాదించేవారని స్థానికులు చెప్తున్నారు. తర్వాత కొంతకాలానికి న్యాయవాద వృత్తికి స్వస్తి పలికి బళ్లారి ప్రాంతాల్లో వ్యవసాయం చేశారు. ఈయన కన్నడంలో తెలుగులో "సకుంద" సినిమాను భాగస్వాములతో నిర్మించారు. మాజీ ముఖ్యమంత్రి భవనం వెంకటరామ్‌కు సన్నిహిత మిత్రుడు కూడా. స్వగ్రామం కారంచేడు, వీరన్నపాలెం గ్రామాల అభివృద్ధికి కూడా విరాళాలు అందజేశారు. పేద విద్యార్థులకు చదువుకోవడానికి చాలామందికి ఆర్థిక సాయం కూడా చేశారు. కారంచేడులోని సిద్ధార్థ వృద్ధాశ్రమం నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు. ఆత్మసాక్షిగా, రంగుల రేఖలు పేరుతో పుస్తకాలు కూడా ఆయన ప్రచురించారు. రామనాథం సతీమణి లక్ష్మి దేవమ్మ ఆరు నెలల క్రితం తుది శ్వాస విడిచారు. రామనాథం కుమారుడు ఉద్యోగ రీత్యా జపాన్‌లో స్థిర పడ్డారు. రామనాథం మృతి పట్ల చీరాల సీనియర్ సిటిజన్ సమాఖ్య, వీరన్నపాలెం హైస్కూల్ కరస్పాండెంట్ గోరంట్ల శేషగిరిరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

ముగిసిన హెచ్ఎంల శిక్షణా తరగతులు

ప్రతిభ చూపిన ప్రధానోపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతిభ చూపిన ప్రధానోపాధ్యాయులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఆర్‌జెడి

పాఠశాలల నిర్వహణలో ప్రధాన భూమిక నిర్వహించే ప్రధానోపాధ్యాయులు మంచి నాయకత్వ లక్షణాలను అలవర్చు కోవాలని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వీఎస్ సుబ్బారావు తెలిపారు. ఆదివారం బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షా (సీమ్యాట్) ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయులంతా చిత్తశుద్ధితో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు ఖచ్చితంగా సాధించవచ్చని చెప్పారు. ఉపాధ్యాయులు క్షేమంగా, సంతోషంతో ఉంటే విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించగలరన్నారు. మంచి సమాజాన్ని నిర్మించడానికి విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో మార్పు తేవాలని అన్నారు. విద్యారంగంలో సమూల మార్పులను అవగాహన చేసుకొని ముందుకు సాగాలన్నారు. విద్యార్థుల విద్యే భవిష్యత్తుకు పెట్టుబడిగా భావించి నాణ్యమైన, ఉత్తమ విద్యను అందించాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి వీరభద్రరావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ పాల్గొన్నారు.

ఓర్సు కొండలరావు మృతి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం, అడ్డ రోడ్డు గ్రామం లో ఆదివారం తెల్లవారు జామున త్రిపురాంతకం మాజీ ప్రజాశక్తి విలేఖరి ఓర్సు కొండలరావు(65) అనారోగ్యంతో మృతి చెందా రు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన గతంలో త్రిపురాం తకం నుంచి సిపిఎంలోనూ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గానూ పని చేశారు. 1994లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన అక్షర ప్రకాశం అక్షరాస్యతా ఉద్యమ కళాయాత్రలో రెండు నెలలపాటు పనిచేశారు. ఇతర పౌరాణిక నాటకాల్లోనూ ఆయనకు ప్రవేశం ఉంది. కాగా కొండలరావు, ప్రజాశక్తి సంతమాగులూరు విలేకరి ఓర్సు కొండలుకు స్వయానా సోదరుడు. కొండలరావు మృతి పట్ల ప్రజాశక్తి అద్దంకి డివిజన్ ఇన్‌చార్జ్ బి విజయ్ కుమార్, మేదరమెట్ల విలేఖరి యోహాన్, స్థానిక పాత్రికేయులు బి కృష్ణారెడ్డి, కోటేశ్వరరావు, ఆంజనేయులు, నాగూర్‌వలి, జి రామ్మోహన్‌రావు, గ్రామ సర్పంచి సన్నెబోయిన గురు యాదవ్ తదితరులు పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

సర్పాల సయ్యాట!

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని నాగులపాడు రోడ్డులో ఎస్ఈబి కార్యాలయం వద్ద రెండు జంట పాములు దాదాపు గంటన్నర పైగా నృత్య విన్యాసాలు చేశాయి. ఈ పాముల విన్యాసాలు చూడడానికి చుట్టుపక్కల వారు అక్కడకు చేరారు.

విద్యుత్ ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అద్దంకి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అద్దంకి డివిజన్ కమిటీ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో డివిజన్ విద్యుత్ ఉద్యోగులు మరియు కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంసిహెచ్ వీరాంజనేయులు మాట్లాడుతూ విజయవాడలో రాష్ట్ర సదస్సుకు అందరు కార్మికులు, ఉద్యోగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. న్యాయమైన కోరికల కోసం జరుగు పోరాటాన్ని జయప్రదం చేయాలన్నారు. డివిజన్ కార్యదర్శి వైవిఎస్ నరేష్ మాట్లాడుతూ సదస్సు ముఖ్య ఉద్దేశం కాంట్రాక్టు కార్మికుల చిరకాల కోరిక అయిన రెగ్యులరైజేషన్ 2018

కరపత్రం ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సంవత్సరం పిఆర్సి గడువు ముగిసి 15 నెలలు అయినప్పటికీ కొత్త వేతన ఒప్పంద యాజమాన్యం సిద్ధం పడడం లేదన్నారు. ఉద్యోగుల కార్మికుల పట్ల యాజమాన్యం ఉన్న చిన్నచూపును చెబుతుందన్నారు. జివిఎమ్ గ్రేడ్ టూల ప్రాణం ఫణంగా పెట్టి పనిచేస్తున్నారన్నారు. వారికి ప్రొఫెషన్ డిక్లేర్ చేయలేదని, మరణించిన వారి స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టడం లేదని, విద్యుత్ ఉద్యోగుల కార్మికులు వేతనాల కోసం ప్రతి నెల ఎదురుచూడాల్సిన స్థితికి నెట్టి వేయబడ్డారని అన్నారు.

డివిజన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ దుర్భర పరిస్థితి నుంచి బయట పడాలంటే ఉద్యోగ కార్మికులు ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, తుంపూడి శ్రీను సాంబశివరావు, నవీన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పనకు

ఎఫ్‌డిఐలను తీసుకొచ్చేందుకు కృషి

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు

ప్రజాశక్తి-పొదిలి

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఎఫ్‌డిఐలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష తెలిపారు. తలమళ్ల క్యాంప్ వద్ద పొగాకు రైతులతో ఆదివారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన పొగాకు రైతు సంఘం నాయకులు గుంటూరి సుబ్బయ్యతో మాట్లాడారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్మెంట్ వస్తే పొగాకు రైతుకు మంచి రేటు వస్తుందని వివరించారు. పొగాకు రైతులకు పెట్టుబడి బాగా పెరిగిందని కేవలం 36.5 టన్నులకు మాత్రమే బోర్డు అనుమతి ఇస్తుందన్నారు. కనీసం 50 టన్నులు అమ్ముకోవడానికి అనుమతి ఇవాలన్నారు. పంటకు ఇన్స్యూరెన్స్ లేక పోవడం వలన అకాల వర్షాలు వచ్చినప్పుడు అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు లోకేష్‌కు వివరించారు. పెరిగిన ఎరువుల ధరలు, అకాల వర్షాలతో నష్టపోతునక్న పొగాకు రైతులకు మాత్రం జగన్ ప్రభుత్వం ఒక్క రూపాయి పరిహారం కూడా ఇవ్వలేదని తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రం ఇచ్చే సహాయంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకి రూ.20 వేల సాయం అందిస్తామని తెలిపారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రూ.50 వేల లోపు రైతు రుణాలు అన్ని ఒకే సంతకంతో మాఫీ చేశామని గుర్తు చేశారు.ొగాకు రైతుల పెట్టుబడి తగ్గించేందుకు డ్రిప్ ఇరిగేషన్, ఎరువులపై లు, రుణాలు అందిస్తామన్నారు. అంతేకాక పెట్రోల్, డీజిల్ ధరలపై పన్నులు తగ్గిస్తామన్నారు. రైతులు పంటలు స్టాక్ పెట్టుకోడానికి రేకుల షెడ్డు నిర్మాణానికి సహాయం అందిస్తామని తెలిపారు.

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

చీమకుర్తిలో లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

కరుణకట్టిన నేరస్తుడితో యుద్ధం

రాష్ట్రంలో కరుడు గట్టిన నేరస్తుడితో యుద్ధం చేస్తున్నామని, ఈ నేపథ్యంలో అందరమకూ కలిసి కట్టు పనిచేయాలని నారా లోకేష్ పిలుపు నిచ్చారు. తలమళ్ల క్యాంప్ సైట్‌లో కొండపి నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తల లోకేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత బాబాయిని చంపిన క్రిమినల్‌తో యుద్ధం చేస్తున్నామన్నారు. సిబిఐ తాజా ఛార్జిషీట్‌తో బాబాయిని ఎవరు చంపారో తెలిసిపోయిందన్నారు. ఈ నాలుగేళ్లలో చేసిన పోరాటం ఒకటైఐతే రాబోయే 9 నెలల్లో

లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న బిఎన్. విజయ్‌కుమార్

చేసే పోరాటం కీలకమన్నారు. దొంగ కేసులు పెట్టేందుకు అధికార పార్టీ 420 బ్యాచ్ సిద్ధంగా ఉందని నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కొండపి ప్రజలు టీడీపీని దీవించి గెలిపించారని ఈ ప్రాంతాన్ని తన గుండెల్లో పెట్టుకుని అభివద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ కష్టపడితే 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తామన్నారు. టిడిపి అధికారం వచ్చిన వెంటనే భవిష్యత్‌కు గ్యారంటీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. కొండపిలో హ్యాట్రిక్ విజయం సాధించబోతున్నామన్నారు. దామచర్ల సత్య తన తమ్ముడు లాంటి వాడని ఆయన రాజకీయ భవిష్యత్‌ను తాను చూసుకుంటానన్నారు. కొండపి నియోజకవర్గంలో పాదయాత్రను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తమ గ్రామంలోని చిన్నచెరువు, పెద్ద చెరువులకు మూసి వాగు నుండి నీటిని తీసుకునేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని తళమల గ్రామస్తులు నారాలోకేష్‌కు విన్నవించారు.

నారా లోకేష్‌తో ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

ఫ్లోరిన్ నీటితో ఇబ్బందులు పడుతున్నాం

మండల పరిధిలోని గోగినేనివారిపాలెం గ్రామస్తుడు సోమయ్య ఆధ్వర్యంలో యువనేత లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని పరిష్కరించాలని కోరారు.

రామతీర్థం నుంచి మంచినీరు ఇవ్వాలి

మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామ టిడిపి నాయకుడు మండాది పాపిరెడ్డి ఆధ్వర్యంలో యువనేత లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. తమ గ్రామానికి రామతీర్థం ప్రాజెక్టు నుంచి నీరు ఇవ్వాలని కోరారు.

లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-చీమకుర్తి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చీమకుర్తి మండలంలోకి ఆదివారం రాత్రి ప్రవేశించింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని మర్రిచెట్లపాలెం మూసి బ్రిడ్జి వద్ద సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్ ,బాపట్ల మాజీ ఎపీ శ్రీరామ్ మాల్యాద్రి ఆధ్వర్యంలో లోకేష్‌కు స్వాగతం పలికారు. లోకేష్‌కు దారిపొడవునా మహిలలు హారతులిచ్చి నీరాజనాలు పలికారు. పూల వర్షంలో యువనేతకు స్వాగతం పలికారు.

ఆయకట్టు రైతుల వినతి

నారాలోకేష్‌ను బూదవాడ పంచాయతీ పరిధిలో కారుమంచి మేజరు కాలువ ఆయకట్టు రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే సాగర్ కాలువల ఆధునీకరణ చేపట్టి, కారుమంచి కాలువ పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బోరు వేయిస్తున్న దృశ్యం

మంత్రి సురేష్ సొంత నిధులతో చెర్లోతాండాలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని చెర్లోతాండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వైసిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్ నీటి సమస్య తీవ్రత గురించి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకెళ్లాడు. బోరు వేయించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి సురేష్ సొంత నిధులతో ఆదివారం బోరు వేయించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సురేష్ నిధులతోనే మోటారు, పైపులు ఏర్పాటు చేసి చెర్లోతాండా గిరిజనులకు మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే మంత్రి చొరవతో పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరయ్య, కాశి నాయక్, పెద్ద మంత్రూ నాయక్, బాలాజీ నాయక్, మంత్రూ నాయక్, శ్రీను నాయక్ బాబులు నాయక్, బాలు నాయక్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

'ఉగ్ర' ఆధ్వర్యంలో లక్ష మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-కనిగిరి

పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే తన లక్ష్యమని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో 58వ మెగా ఉచిత నేత్ర వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచే వృద్దులు వైద్యపరీక్షల కోసం బారులు తీరారు. ఈ సందర్భంగా గుంటూరు శంకరనేత్రాలయం వైద్యులు 905 మంది వైద్యపరీక్షలు నిర్వహించారు. అందులో 575 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. వైద్యశిబిరానికి వచ్చిన వృద్ధులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కంటి ఆపరేషన్లు ఆపరేషన్లు అవసరమైన వృద్ధులను ఈనెల 30న 180 మంది,ఆగస్టు 1న 180, ఆగస్టు 3న 180, ఆగస్టు 6న 35 మందిని విడతలవారిగా ప్రత్యేక వాహనాల్లో గుంటూరు శంకరనేత్రాలయంకు తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. వైద్యశిబిరానికి వచ్చిన వృద్దులను డాక్టర్ ఉగ్ర ఆప్యాయంగా పలకరించారు. ఇప్పటివరకు జనని చారిటబుల్‌ట్రస్ట్, జిల్లా అంధత్వనివారణ సంస్థ, గుంటూరు శంకరనేత్రాలయం సహకారంతో 58 ఉచిత నేత్ర వైద్యశిబిరాలను నిర్వహిం చినట్లు తెలిపారు. లక్షమంది వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహించి 24 వేలకుపైగా శస్త్రచికిత్సలు చేయించినట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకరనేత్రాలయం వైద్యులు హారికా రెడ్డి, వెంకటేశ్వర్లు, దీక్ష, వైద్యసిబ్బంది, టిడిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

'యువ గళం' పాదయాత్రను జయప్రదం చేయండి

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్‌రావు

- 26న ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ

- విడిది కేంద్రం ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను ఒంగోలు నియోజక వర్గంలో విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. ఒంగోలు నగరంలో విస్తృతంగా పర్యటించి 7 క్లస్టర్ ఇన్‌ఛార్జులు, డివిజన్ల అధ్యక్షులు, బూత్,సెక్షన్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తల తో యువగళం పాదయాత్ర ఏర్పాట్లపై దామచర్ల జనార్ధన్ రావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఈ నెల 25న యువగళం పాదయాత్ర ఒంగోలు నగరానికి చేరుకుంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఏత్తున స్వాగతం పలకాలని కోరారు, 26న కర్నూల్ రోడ్డు నుంచి మంగమూరు రోడ్డు జంక్షన్ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగమూరు రోడ్డు లోని ఆచాలనంద ఆశ్రమం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీగా సాయిబాబా దేవాలయం, జయరాం థియేటర్, మున్సిపల్ కార్యాలయం, చర్చి సెంటర్, ట్రంక్ రోడ్డు, అద్దంకి బస్ స్టాండ్, టీడీపీ కార్యాలయం మీదుగా ఏ1 కన్వెన్షన్ హాలు ఎదురుగా ఉన్న విడిది కేంద్రం వద్ద చేరనున్నట్లు తెలిపారు. ఈనెల 27న జయహెూ బిసి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న సాయంత్రం పాదయాత్ర ప్రారంభమై నూతలపాడు నియోజకవర్గం లోకి చేరుతుందన్నారు.

విడిది ఏర్పాట్లను పరిశీలిస్తున్న దామచర్ల జానార్ధన్, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

విడిది కేంద్రం పరిశీలన

నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా గుంటూరు రోడ్డులో విడిది కేంద్రాన్ని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, నాయకులు కొఠారి నాగేశ్వరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, జూటూరి కృష్ణ, పి.వెంకటేశ్వర రెడ్డి, వేమూరి వెంకటేశ్వర్లు, కమ్మ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కనిగిరి

పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే తన లక్ష్యమని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో 58వ మెగా ఉచిత నేత్ర వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచే వృద్ధులు వైద్యపరీక్షల కోసం బారులు తీరారు. ఈ సందర్భంగా గుంటూరు శంకరనేత్రాలయం వైద్యులు 905 మంది వైద్యపరీక్షలు నిర్వహించారు. అందులో 575 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. వైద్యశిబిరానికి వచ్చిన వృద్ధులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కంటి ఆపరేషన్లు ఆపరేషన్లు అవసరమైన వృద్ధులను ఈనెల 30న 180 మంది,ఆగస్టు 1న 180, ఆగస్టు 3న 180, ఆగస్టు 6న 35 మందిని విడతలవారిగా ప్రత్యేక వాహనాల్లో గుంటూరు శంకరనేత్రాలయంకు తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. వైద్యశిబిరానికి వచ్చిన వృద్ధులను డాక్టర్ ఉగ్ర ఆప్యాయంగా పలకరించారు. ఇప్పటివరకు జనని చారిటబుల్‌ట్రస్ట్, జిల్లా అంధత్వనివారణ సంస్థ, గుంటూరు శంకరనేత్రాలయం సహకారంతో 58 ఉచిత నేత్ర వైద్యశిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. లక్షమంది వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహించి 24 వేలకుపైగా శస్త్రచికిత్సలు చేయించినట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకరనేత్రాలయం వైద్యులు హారికా రెడ్డి, వెంకటేశ్వర్లు, దీక్ష, వైద్యసిబ్బంది, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం నాకిష్టం

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక శాతంలో హాజరై పలు పుస్తకాలను చదువుకున్నారు. విద్యార్థుల విజ్ఞానానికి సంబంధించిన అన్ని పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని వర్ధనరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

10 ఏకోపాధ్యాయ పాఠశాలలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పది ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నట్లు ఎంఇఒ-2 మల్లు నాయక్ తెలిపారు. రేగులపల్లి, భట్టువారిపల్లి ప్రాథమిక పాఠశాలలు, వెంకటాద్రిపాలెం, అంకమ్మచెంచు గూడెం, గౌతమ బుద్ధుని గూడెం, పోతురాజుపెంట, పునరావాస కాలనీ, హనుమంతుని చెంచుగూడెం, రేగులపల్లి గాంధీ నగర్, తిరుమలగిరి కాలనీ, చెర్లో చెంచుగూడెంలలో గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

యర్రగొండపాలెం : ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దారు రవీంద్రారెడ్డి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఓటరు సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సారు. ప్రతి ఇంటిని సర్వే చేసి 18 సంవత్సరాలు నిండిన వారుంటే వారికి సంబంధించిన ఆధార్ జిరాక్స్ ఉంటే సంబంధిత ఫారంలో నమోదు చేయాలన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు ఉంటే ఒకటి తప్పనిసరిగా తొలగించాలన్నారు. ఓటరు సర్వేను జగ్రత్తగా నిర్వహించాలని సూచించారు.

సమస్యలపై అధికారుల నిలదీత

ప్రజాశక్తి- జరుగుమల్లి

మండల పరిధిలోని పచ్చవ ఆర్అండ్‌బి రహదారి శిథిలావస్థకు చేరింది. రహదారి పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయం గురించి ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. రోడ్డు దుస్థితి గురించి ఎందుకు పట్టించుకోలేదని పచ్చవ గ్రామ సర్పంచి కొండాబత్తిన కృష్ణయ్య ఆర్ అండ్ బి వర్క్ఇన్‌స్పెక్టర్‌ను నిలదీశాడు. ఆర్ అండ్‌బి ఎఇ సమావేశాలకు రాకపోతే సమాధానం ఎవరు చెబుతారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జరుగుమల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి బెల్లం నిర్మల సత్యన్నారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. పైడిపాడు

విద్యుత్ సమస్యలపై నిలదీస్తున్న సర్పంచి భాస్కర్‌చౌదరి

గ్రామంలో 1973లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగి చేతికి అందేలో ఎత్తులో ఉన్నాయని, వాటిని సరిచేయాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేదని పైడిపాడు గ్రామ సర్పంచి నాగినేని భాస్కరచౌదరి తెలిపారు. సమావేశానికి సంబంధిత అధికారులు సమావేశానికి రాకపోతే సమాధానం ఎవరు చెబుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశానికి తహశీల్దారు ఉషారాణి, ఆర్ అండ్‌బి ఎఇ మాధవరావు, విద్యుత్ ఎఇ హరీష్, పశువైద్యాధికారి అరుణ గైర్హాజరయ్యారు. సమావేశంలో వైఎస్ ఎంపిపిలు పులి బిక్షాలు,చండి శ్రీలత , ఎంపిటిసిలు బెల్లం భాను ప్రియ, బత్తిన నాగలక్ష్మి, అధికారులు పిఆర్ ఎఇ కోటా శ్రీహరి, ఎఇ యుగంధరరెడ్డి, కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జి. రేష్మి, సచివాలయ కార్యదర్శులు , సిబ్బంది పాల్గొన్నారు.

నీటికుంటగా మారిన సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని బురుజుపల్లె గ్రామంలో రెండు రోజులుగా చిన్నపాటి వర్షం పడుతోంది. మురుగు కాలువలు లేని కారణంగా వర్షపు నీరంతా సిమెంట్ రోడ్డుపైకి చేరింది. దీంతో రహదారులు నీటికుంటను తలపిస్తున్నారు. రహదారులపై నీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. రహదారులకు ఇరువైపుల డ్రైనేజీ కాలువలు నిర్మించలేదు. దీంతో చిన్నపాటి వర్షానికి నీరు ముందుకెళ్లే మార్గం లేక రహదారులపైనే నిలిచిపోతుంది. వర్షపు నీటిలో రాకపోకలు సాగించేందుకు జులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలు లేని కారణంగా నీరు రోజుల తరబడి నిలబడంతో దుర్వాసన వెదజల్లుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా దోమలు వ్యాప్తి చెందటంతో రాత్రి పూట కంటి

గ్రామంలో నీటి కుంటను తలపిస్తున్న మెయిన్ సిమెంట్ రోడ్డు

మీద కనుకే ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు నిర్మించి మురుగునీటి ఇక్కట్ల నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

100 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కొండపి

ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని విశ్వాస్ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ యర్రం నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం నాడు కొండపిలోని ఆర్‌సిహెచ్ సుబ్బయ్య క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ సరైన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వాస్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కొండారెడ్డి రాధిక, విశ్వాస్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలో ప్రతి కౌలు రైతును గుర్తించి, వాళ్లకు కౌలు కార్డు జారీ చేయాలని తహశీల్దారు పద్మావతి ఆదేశించారు.స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఆదివారం సిసిఆర్సి కార్డులకు సంబంధించి రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ : ఎమ్మెల్యే

గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెదారికట్ల గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గడపకూ గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడూ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజానీకం సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు తన వంతుగా కషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మూరబోయిన మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మాజీ ఎంపిపి ఉడుముల రామనారాయణరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ఎస్.పెద్దవెంకటరెడ్డి, రేగడపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వరరెడ్డి, వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా విద్యుత్ దీపాలు

జాతీయ రహదారిలో కమ్ముకున్న చీకటి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ పరిధిలోని పారిశ్రామికవాడలో జాతీయ రహదారి-565లో పర్యవేణ అధికారులు కనీసం కూడా చూడటం లేదు. దీంతో జాతీయ రహదారిలో చీకటి ఏర్పడింది. ఏడేళ్ల క్రితం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగడం లేదు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. నివాస ప్రాంతాల్లో జాతీయ రహదారి ఉందంటే ఖచ్చితంగా విద్యుత్ దీపాలు వెలిగించాలి. జాతీయ రహదారిలో వాహనాలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. వేగం కూడా ఎక్కువగానే ఉంటుంది. నిబంధనల ప్రకారం జాతీయ రహదారి మధ్యలో నిర్మించిన డివైడర్లపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అవి ఒక్కరోజు కూడా వెలగలేదు. పలకల పారిశ్రామికవాడ మీదుగా వెళ్తున్నవి జాతీయ రహదారిలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటితో పాటు పారిశ్రామికవాడ కావడంతో అక్కడ నిర్వహణలో పలకల పరిశ్రమలోని వాహనాలు, కార్మికుల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ రహదారిలో రాత్రివేళ వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయి. వాహనాల వెలుగులతో మాత్రమే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. కొందరు ద్విచక్ర వాహనదారులు లైట్లు లేకుండా వేగంగా రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిలో చీకటి మధ్య రాకపోకలు

వెలగని విద్యుత్ దీపాలు

సాగించాలంటేనే భయంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రహదారిపై ఉన్న విద్యుత్ దీపాల గురించి పలుమార్లు పత్రికల్లో కథనాలు వెలువడుతున్నా పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి పర్యవేక్షణ అధికారుల కార్యాలయం విజయవాడలో తప్ప జిల్లా కేంద్రమైన ఒంగోలులో కూడా లేకపోవడం ఇలాంటి చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రజాశక్తి

సోమవారం 24 జులై 2023

గుర్రపుడెక్కను తక్షణమే తొలగించాలి : ఏలూరి

ప్రజాశక్తి -చిన్నగంజాం

కొమ్మమూరు కాలువలో గుర్రపుడెక్కను తొలగించి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కొమ్మమూరు కాల్వల్లో పేరుకున్న గుర్రపుడెక్క నీటిపారుదలకు అవరోధంగా మారిందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కొమ్మమూరు కాలువ కింద రైతాంగం 15 వేల ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నారని ఆయన తెలిపారు. మండల రైతాంగం ఆధారపడి ఉన్న

కొమ్మమూరు కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

కోమ్మమూరు కాలువలో తూటుకాడ, గుర్రపుడెక్కతో నిండి ఉండటంతో రైతాంగంలో అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ఖరీఫ్ సాగు కోసం ఇప్పటికే పలువురు రైతులు వరి నారుమడులు పెంచుతున్నారని పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది కాలువల్లో గుర్రపు డెక్కను తొలగించి చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వం వ్యవసాయ సీజన్ ప్రారంభమై కాలువ మరమ్మత్తులు గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి తూటుకాడ, గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలో పెరిగిన గుర్రపుడెక్క ఇతర తీగ మొక్కలను తొలగించి మునశీవారిపాలెం, ఉప్పుగుండూరు, నీలాయపాలెం, పెద్దగంజాం రాజుబంగారుపాలెం, గ్రామాల్లో చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.

నేడు జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన రద్దు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించవలసిన స్పందన కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. తమ సమస్యలు తెలియజేయడానికి దూర ప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చే ప్రజలు సోమవారం రావద్దని కోరారు.

నియామకపత్రాన్ని అందుకుంటున్న భరత్‌కుమార్

జైభీమ్ పార్టీ అభ్యర్థిగా బడుగు భరత్

ప్రజాశక్తి-బాపట్ల

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జైభీమ్ భారత్ పార్టీ బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బడుగు భరత్ కుమర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తారని జైభీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడా శ్రవణ కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదివారం విజయవాడ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశం అనంతరం భరత్ అభ్యర్థితత్వాన్ని ప్రకటించి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తొలిసారిగా జైభీమ్ పార్టీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం పట్ల నియోజకవర్గ స్థాయిలో భరత్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం పట్ల భరత్ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

తండ్రిని కోల్పోయిన చిన్నారులు

ప్రజాశక్తి-కొండపి

సంపాదించే తండ్రి కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి మరణించడంతో ముగ్గురు చిన్నారులు ఆసార కోల్పోయిన సంఘటన కొండపి బిసి కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే బిసి కాలనీకి చెందిన కొనికి శ్రీకాంత్ (29) అనే వ్యక్తి శనివారం నాడు జరుగుమల్లి మండలం కలికివాయి బిట్రగుంట దగ్గర రైలు పట్టాలపై పడి మృతి చెందిన సంఘటన అందరికి తెలిసిన విషయమే.. శ్రీకాంత్‌కు భార్య ప్రసన్నతో పాటు ముగ్గురు ఆడపిల్లలు దరణి–9 సంవత్సరాలు(3వ తరగతి), సుహాసిని–6 సంవత్సరాలు (2వ తరగతి), శాంతిలక్ష్మి(9 నెలలు) – ఉన్నారు. శ్రీకాంత్‌కు ఆస్తిపాస్తులు ఎటువంటి ఆదారం లేదు అతని సంపాదనమీదనే కుటుంబం జీవనం సాగిస్తున్నది. కుటుంభానకి ఆధారం అయిన యజమాని మరణించడంతో ముక్కు పచ్చలారని ఆ చిన్నారులు దిక్కులేని వారిగా మిగిలిపోయారు. ఆ చిన్నారులను ఏ విధంగా బ్రతికించుకోవాలని మృతుని భార్య విలపించడం చూపరులను కన్నీటి పర్యంతం చేసింది.

తండ్రిని కోల్పోయిన ముగ్గురు చిన్నారులు

200 మందికి కంటి పరీక్షలు

కంటీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ మానస

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో ఒంగోలు సర్వ నేత్రాలయ కంటి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఉచితం వైద్య శిభిరానికి ఎక్కువ సంఖ్యలో గ్రామస్తులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస పెనుమెచ్చ ఆధ్వర్యంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ మానస మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి నామమాత్రపు ఫీజులతో చేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరం లేనివారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉప్పలపాటి శ్రీనివాసులు, పలువురు వైద్యాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పావులూరులో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

గాదె సుబ్బాయమ్మ

ఇంకొల్లు మండలం పావులూరులో నేత్రదానం జరిగింది. పావులూరు గ్రామానికి చెందిన గాదె సుబ్బాయమ్మ (75) మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చారు. రోటరీ ఆధ్వర్యంలో 512వ నేత్రదానం జరిగింది. కుటుంబ సభ్యులు రోటరీ అవయవదాన కమిటికి సమాచారం అందించారు. మాజీ సర్పంచ్ పులఖండం బద్రిరెడ్డి సహకారంతో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు పావులూరు వచ్చి కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులు గాదె వెంకట సుబ్బారెడ్డి, అంజిరెడ్డి, సీతారావమ్మలను రోటరీ అవయవదాన కమిటి ప్రతినిధులు సోమేపల్లి రామ్మోహన్‌రావు, రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి) అభినందించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు, అద్దేపల్లి, ఐలవరం, కనగాల గ్రామాల పద్మసాలియ విద్యార్థులు వెల్ఫేరు అసోసియేషన్ అందించే ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కటకం సాంబశివరావు, కాగిత యనదిరావులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మార్కండేయ పద్మ సాలియ ఇంటరేశీషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అందించే ఈ ఆర్థిక సహాయం నిరుపేదలైన ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ ,బిటెక్, పి.జి విద్యార్థులు ఆగస్టు 15వ తేదీ లోగా రేషన్ కార్డు, ఆధార్, ఐడి కార్డు జిరాక్సుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న సంఘ సభ్యులు

మహిళా సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానికంగా ప్రసిద్ధి చెందిన శ్రీకనకనాగవరపమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం బాపట్ల జిల్లా మహిళా సంఘం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. అధ్యక్షులుగా బండ్ల తిరుమలాదేవి, ప్రధాన కార్యదర్శిగా పృధ్వి అరుణ, అసోసియేట్ ప్రెసిడెంట్ చల్లా అనురాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ యర్ర శివ నాగమల్లేశ్వరి,పెరిశెట్ల పద్మజ ,కార్యదర్శులు పింజల ప్రసన్నలక్ష్మి, జాయింట్ సెక్రటరి మాచర్ల ఉషా, కన్వీనర్ పృధ్వి మాధవి కమిటీ సభ్యులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి పందిళ్ళపల్లి నుండి హస్తినాపురం వరకు దేవాంగ ప్రజలు పాల్గొన్నారు.

ఓట్ల సర్వేలో సరిచూసుకోవాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం జరుగుతున్న ఓట్ల పరిశీలనలో పార్టీ నాయకులు కార్యకర్తలు వెంట ఉండి ఓట్లు సరి చూసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా సూచించారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక ప్రాంతాలలో బోగస్ ఓట్లు వెలుగు చూస్తున్నాయని అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటుతో పాటు కుటుంబ సభ్యుల ఓట్లు ఉన్నాయా? లేక గల్లంతయ్యాయా అని పరిశీలించుకోవలన్నారు. ఓటు లేకపోతే మరోమారు ఓటు కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తమ ఇంట్లో కొత్త ఓట్లు నమోదు అయితే తొలగించుకోవలసిన వారు18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటుకు దరఖాస్తు చేసుకుంటే స్వీకరిస్తారని తెలిపారు.

రేడియో తొలి ప్రసారానికి 96 ఏళ్లు

ప్రజాశక్తి-బాపట్ల

దేశంలో తొలిసారిగా 1927 జూలై 23న ఆవిర్భవించిన ఆకాశవాణి రేడియో ప్రసారాలు నేటికీ రేడియో శ్రోతలకు విజ్ఞాన వినోదభరిత కార్యక్రమాలను శ్రవణానందకరంగా ఆకాశవాణి అందిస్తూనే ఉందని సాహితి భారతీ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. ఆదివారం జాతీయ ప్రసార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి ఆవిర్భవించి 96 ఏళ్లు గడిచిన సందర్భంగా సాహితీ భారతీయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్మ మాట్లాడారు. భారత దేశంలో తొలిసారిగా కలకత్తా, బొంబాయి నగరాలలో రేడియో ప్రసారాలు ప్రారంభమయ్యాయన్నారు. లార్డ్ ఇర్విన్ ఇంపీరియల్ బ్రాడ్ కాస్టింగ్ అనే సంస్థ ద్వారా రేడియో ప్రసారాలు ప్రారంభించారన్నారు. సాహితి భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ రేడియో ఒక అద్భుత విజ్ఞాన వినోద

మాట్లాడుతున్న నరసింహవర్మ

సాధనమన్నారు. ప్రచార ప్రసార సాధనాల్లో రేడియో ప్రధాన భూమిక నిర్వహించిందన్నారు. ప్రపంచంలో జరిగే అనేక వార్తా విశేషాలను రేడియోల ద్వారా ప్రజలకు చేరవేసే సాధనంగా రేడియోకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మీడియం వేవ్, షార్ట్ వేవ్, ఎఫ్ఎంల ద్వారా రేడియోలో వివిధ నాటికలు, కథానికలు సినిమా పాటలు శాస్త్రీయ లలిత సంగీతం వంటి వినోద విజ్ఞాన కార్యక్రమాల ప్రసారాలతో రేడియో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న సాంకేతికతతో ఇతర ప్రచార ప్రసార సాధనాలు ప్రజా బాహుళ్యంలోకి ప్రవేశించినా రేడియో తమ ఉనికి కోల్పోలేదన్నారు. రేడియో ప్రసారాలు భారతదేశంలో దాదాపు 90 శాతం వరకు విస్తరించి ఉన్నాయన్నారు. రేడియోతో పాటు ఎఫ్ఎం ప్రసారాలతో నేటి మానవ జీవితంలో రేడియో ఒక భాగంగా మారిపోయిందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ కృష్ణ, మర్రి మాల్యాద్రిరావు, పువ్వాడ వెంకటేశ్వర్లు, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కొమ్మారి సీతా రామాంజనేయులు, రెంటాల మురళీ రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కోఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి.?

హైదరాబాద్‌లో బాలినేనితో ప్రత్యేక భేటీ



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి సీనియర్ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి జిల్లాకు కో ఆర్డినేటర్‌గా నియమితు లయినట్లు సమాచారం. సిఎం జగన్ అధికారికంగా ప్రకటించడమే తరువాయిగా చెబుతున్నారు. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల కోఆర్డినేటర్ బాధ్యతల్లో ఉన్న సీనియర్ నేత బాలినేని ఇటీవల ఆ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.. సిఎం జగన్ రెండు సార్లు పిలిచి పదవిలో కొనసాగాలని బాలినేనిని కోరారు. అందుకు బాలినేని కొన్ని కారణాలు చెప్పి ససేమిరా అన్నారు. సిఎం జగన్ ఈ పదవికి ప్రస్తుతం సీనియర్‌గా ఉన్న విజయసాయిరెడ్డిని ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో సీనియర్ నేత బాలినేనితో విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. వారిద్దరి మధ్య కోఆర్డినేటర్ బాధ్యతల వ్యవహారం, ఈ మూడు జిల్లాల్లో పార్టీ పరిస్థితిపై సాధారణంగా చర్చ సాగినట్లు సమాచారం. దీనిపై బాలినేనిని ప్రశ్నించగా మర్యాద పూర్వకంగా వచ్చి కలిశారన్నారు. కో ఆర్డినేటర్‌గా ఆయనే రావచ్చని సూత్రప్రాయంగా చెప్పారు.

శాంతి రథం ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శాంతి రథాన్ని మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ రథాన్ని కీర్తిశేషులు దొడ్డా శంకరరెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుటుంబీకులు, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్
- ఒంగోలులో సిపిఎం నగర కమిటీ ధర్నా

దర్శిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై దాడులను ఆపాలని, ఆ రాష్ట్ర సిఎంను తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో సాగర్ సెంటర్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ అధ్యక్ష త వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ బిజెపి మణిపూర్‌లో రెండు తెగల మధ్య గొడవలు పెట్టి అక్కడ గిరిజనులపై దాడులను ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. బిజెపి ప్రభుత్వం దాడులను అరికట్టాల్సింది పోయి ఇంకా దాడులు పెరిగే విధంగా వ్యవహరించిందన్నారు. మహిళలపై దాడి చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడుల నివారణలో విఫలమైన మణిపూర్ సిఎంను పదవి నుంచి తొలగించాలని కోరారు ప్రజాస్వామ్య దేశంలో దాడులకు పాల్పడం దుర్మార్గమని, శాంతిని నెలకొల్పి ప్రజలు స్వేచ్ఛగా జీవించే విధంగా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు చీకటి శ్రీనివాసరావు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు శ్రీరామ శ్రీనివాసులు, అత్తంటి శ్రీనివాసులు దారా వెంకటేశ్వర్లు ఎస్‌కె.హరికష్ణ ప్రజా సంఘాల నాయకులు జి.ఆదిలక్ష్మి, వై.దానియేలు, వి. మాలకొండయ్య జి.భీష్మాచారి, షేక్ పీర్ సాహెబ్ పాల్గొన్నారు. **కొండపి :** బిజెపి దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలని వామపక్షాల నాయకులు తెలిపారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణ కాండకు నిరసనగా కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 79 రోజులుగా మణిపూర్‌లో మత చిచ్చు రగిల్చి గిరిజన స్త్రీలను వివస్త్రీలు చేసి బహిరంగా ఊరేగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కెజి.మస్తాన్, న్యూడెమోక్రసి నాయకులు ఎన్.నాగరాజు, సిపిఐ నాయకురాలు లక్ష్మి, పిఆర్‌పి నాయకులు బి.నాగభూషణం, వై.చంద్రశేఖర్, వై.కోటేశ్వరమ్మ, సిహెచ్.రంగారావు, ఎన్.నరశింహం, పురుషోత్తం పాల్గొన్నారు. **వెలిగండ్ల :** మణిపూర్‌లో అత్యాచారానికి గురైన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల కన్వీనర్ రాయల మాలకొండయ్య మాట్లాడుతూ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం గిరిజన తెగల మధ్య బిజెపి పెట్టిన చిచ్చుతో మణిపూర్ దాదాపు మూడు నెలలుగా నెత్తురోడుతుందన్నారు, మణిపూర్ బాధితులపై జరిగిన అమానత్వానికి సంబంధించిన విజువల్స్‌తో కూడిన వీడియో, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సుప్రీంకోర్టు గట్టిగా మొట్టికాయలు వేసినట్లు తెలిపారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పి అక్కడ ఉరన్న తెగల మధ్య భేదప్రాయాలు రాకుండా, మతోన్మాదని రెచ్చగొట్టకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు,. వ్యవసాయ కార్మిక సంఘం, జిఎంపిఎస్, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, స్కూల్ స్వీపర్స్, వెలుగు యానిమేటర్స్, తాపీ వర్కర్స్ యూనిన్ కార్మికులు సిగినం తిరుపతయ్య, కండే బాలకష్ణ, రాయల రమాదేవి, వై.జయకుమారి, బుర్ర రత్తమ్మ, కొటికల వరలక్ష్మి, కాకర్ల నాగేశ్వరి, మెలం వెంకటేశ్వర్లు, ఎం.రాణి, కె.లక్ష్మి, కరుణ రాణి, నాగమ్మ, నాగరాణ పాల్గొన్నారు, **దర్శి :** మణిపూర్‌లో మహిళలపై దాడులు అరికట్టి, శాంతిని పునరు ద్ధరించాలని సిపిఎం దర్శి నియోజక వర్గ కార్యదర్శి రంగారావు కోరారు. మణిపూర్‌లో దాడులు అరికట్టాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎంపిడిఒ కార్యాలయం వద్ద నుంచి గడియారస్తంభం వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్టాడుతూ మణిపూర్ ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవాలన్నారు. ఘటనపై సుప్రీంకోర్డు జడ్జీ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, డివైఎఫ్ఐ మహిళా, ఎస్ఎఫ్ఐ ప్రజాసంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, కె. పిచ్చయ్య, నారాయణ, నాగేశ్వరరావు, సామ్యేలు, లక్ష్మీ, యలమందారెడ్డి, నాగరాజు, రంగమ్మ, పద్మావతి, గోగు వెంగయ్య, ఆదినారాయణ, మున్నా, బాషా, రంగనాయకలు పాల్గొన్నారు.

వినియోగదారులకు అండగా లీగల్ మెట్రాలజీ

- తూనికలు, కొలతల పట్ల ప్రజల్లో చైతన్యం పెరగాలి
- లీగల్ మెట్రాలజీ నెల్లూరు ప్రాంతీయ డిప్యూటీ కంట్రోలర్ ఐజక్

ముఖాముఖి

ప్రజాశక్తి- బాపట్ల

వినియోగదారులు తాము కొనుగోలు చేస్తే ప్రతి వస్తువు విషయంలో మోసపోకుండా లీగల్ మెట్రాలజీ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు లీగల్ మెట్రాలజీ(బాపట్ల,ప్రకాశం, నెల్లూరు జిల్లాల) నెల్లూరు ప్రాంతీయ డిప్యూటీ కంట్రోలర్ కె.ఐజక్ తెలిపారు. ఏదైనా వస్తువుకు సంబంధించి తూనికలు, కొలతల్లో తేడా ఉంటే వినియోగ దారులు ఫిర్యాదు చేయాలన్నారు. తూనికలు, కొలతల విషయంలో లీగల్ మెట్రాలజీ తీసుకుంటున్న చర్యలు గురించి ఐజాక్ ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

వ్యాపారులు చట్టబద్ధమైన తూనికలు కొలతలతో వినియోగదారులకు వస్తువులను అందజేయాలి. తూనికలు, కొలతలు విషయంలో అవకతవకలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తాం.తూనికలకు వినియోగిస్తున్న కాటాలు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను తనిఖీ చేస్తాం. కాటాలు సక్రమంగా ఉన్నాయా, లేదా అనే విషయాన్ని లీగల్ మెట్రాలజీ అధికారులు పరిశీలిస్తారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుపై తయారీదారుని పేరు, చిరునామా విధిగా ఉండాలి. వస్తువు పరిమాణం తయారు చేసిన నెల సంవత్సరం గరిష్ఠ చిల్లర ధర, కస్టమర్ కేర్ నంబరు ఆయా వస్తువుల ప్యాకేజీపై ముద్రించాలి. నెల్లూరు ప్రాంతీయ లీగల్ మెట్రాలజీ పరిధిలో బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాలలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్, బాపట్లలో ఓ అసిస్టెంట్ లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ ఉంటారు ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, పొదిలి మార్కాపురంలో ఇన్‌స్పెక్టర్లు, ఒంగోలులో అసిస్టెంట్ కంట్రోలర్ ఉంటారు. నెల్లూరు జిల్లాలో కావలి నెల్లూరులో ఇన్‌స్పెక్టర్, నెల్లూరులో అసిస్టెంట్ కంట్రోలర్ నిరంతరం తూనికలు కొలతలపై తనిఖీలు చేస్తుంటారు,

ప్రజల్లో చైతన్యం పెరగాలి..

తూనికల కొలతల్లో ప్రజలు ఎలాంటి మోసానికి గురి కాకుండా నాణ్యమైన వస్తువులను పొందటం వినియోగదారుల హక్కు. ఆ హక్కును సాధించుకోవడానికి వినియోగదారులు మరింత చైతన్యవంతం కావాలి. బహిరంగ మార్కెట్లో వినియోగదారులు పలు రకాలుగా మోసాల తో పాటు తక్కువ తూకాల బారిన పడకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకొనెందుకు లీగల్ మెటరాలజీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

పెట్రోల్ బంకుల్లో మోసాలను నియంత్రించాం

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చిప్పుల చిప్ల ద్వారా పెట్రోల్ కొలతల్లో మోసాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ పాటికే ఆ తరహా మోసాలను గుర్తించాం. పట్టుబడిన వారికి భారీగా జరిమానాలు విధించాం. ఆ తరహా మోసాలను నియంత్రించాం.

1976 నుంచి తూనికలు కొలతల యాక్ట్

వినియోగదారుల రక్షణ కోసం 1976లో స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ యాక్ట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్యాక్ చేసి అమ్మే వస్తువులకు సంబంధించి స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ (ప్యాకేజ్డ్ కామొడిటీస్) రూల్స్‌ను రూపొందించారు. దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని ఒకే విధంగా అమలు చేసేందుకు వీలుగా 1985లో స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) యాక్ట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది.తూనికలు-కొలతల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. రాష్ట్రంలో లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ ప్రధానాధికారిగా ఈ విభాగం పని చేస్తోంది. రీజనల్ డిప్యూటీ కంట్రోలర్లు, అసిస్టెంట్ కంట్రోలర్స్, డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్లు ఈ శాఖలోని ప్రధానమైన అధికారులుగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారు.

ఫిర్యాదు ఎవరికి చేయాలి

తూనికలు-కొలతల విషయంలో మోసపోయిన సందర్భాల్లో స్థానిక లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్, కంట్రోలర్‌కు,లీగల్ మెట్రాలజీ గ్రీవెన్స్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. వ్యాపారి మోసగిస్తున్నట్లు నిరూపణ అయితే ఆ వ్యాపారికి జరిమానాతో పాటు జైలుశిక్ష కూడా విధించే అవకాశం ఉంది. స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ యాక్ట్ 1976, స్టాండర్డ్స్ ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 1985లలో 1986లో చేసిన సవరణల తో వినియోగదారులు, గుర్తింపు పొందిన వినియోగదారుల సంఘాలు నేరుగా కోర్టుల్లో కేసులు దాఖలు చేసే అవకాశం లభించింది. వినియోగదారుల రక్షణ చట్టం అమలులో భాగంగా ఏర్పాటైన జిల్లా వినిగదారుల ఫోరం, రాష్ట్ర కమిషన్, జాతీయ కమిషన్‌లలో కేసు దాఖలు చేసి నష్టపరిహారం పొందవచ్చు.

తెలుగు యువత మండల కార్యదర్శిగా కొండ్రగుంట

ప్రజాశక్తి-మద్దిపాడు

తెలుగు యువత మండల కార్యదర్శిగా కొండ్ర గుంట రమేష్ బాబును నియమించినట్లు టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, తెలుగు యువత అధ్యక్షుడు చుండూరు రఘురాం తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిఎన్.విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు రమేష్ బాబును నియమించినట్లు వారు తెలిపారు. తన నియమానికి కృషి చేసిన జయంత్‌బాబు, రఘురాంకు ఈ సందర్భంగా రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - గిద్దలూరు

మొక్కలు నాటడం అందరి బాధ్యత అని గిద్దలూరు రైల్వే స్టేషన్ మాస్టర్ షేక్ నాయబ్ రసూల్, ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ ఎ.హనుమారెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైల్వే స్టేషన్ లోని ఆర్‌పిఎఫ్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి మనుగడకు ఆక్సిజన్ ఎంతో అవసరమని తెలిపారు. మొక్కలు పెంచడం వల్ల సహజ సిద్ధంగానే ఆక్సిజన్ లభిస్తుందన్నారు. అదేవిధ:గా భూమి ఉపరితలంపై ఉష్ణోగ్రతను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుకింగ్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, ఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.